ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
మంగళవారం 20 మే 2025 www.prajaswaramdaily.com 3

# మరో నాలుగు రోజుల పాటు వర్షాలు

హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పాడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మరో నాలుగు రోజులపాటు తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలిపింది. నేడు కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణ్‌పేట్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ, గద్వాల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాల్లో ఎల్లో అలర్ట్స్ జారీ చేసింది. వర్షాల కారణంగా ఎండ తీవ్రత తగ్గనుంది. పగటిపూట ఉష్ణోగ్రతలు ఐదు డిగ్రీల మేర తగ్గే అవకాశముంది.

## చురుగ్గా నైరుతి రుతుపవనాలు

తొలుత ఈ నెల 27న కేరళ తీరాన్ని తాకుతాయని ఐఎండీ అంచనా వేసింది. అయితే, కాస్త ముందుగా 24నే కేరళ తీరంలోకి ప్రవేశించి, జూన్ మొదటి వారంలోనే తెలంగాణలోకి ప్రవేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## మరో 20 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం
# అధికారంలో ఉండాలి

**2న రాజీవ్ యువ వికాసానికి రూ.1000 కోట్లు**

**పేదల ప్రభుత్వం గుండెల్లో పెట్టుకుని కాపాడుకోవాలని పిలుపు**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



నాగర్ కర్నూల్ : జూన్ 2న గిరిజన యువతకు రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకం ద్వారా 1000 కోట్లు మంజూరు చేయబోతున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీపి కబురు చెప్పారు. ఇది పేదల ప్రభుత్వం మన ప్రభుత్వం గుండెల్లో పెట్టుకొని కాపాడుకోండని పిలుపునిచ్చారు.. ఇందిరా జల వికాసం ఆరంభం మాత్రమే కాబోయే రోజుల్లో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయబోతున్నామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో యావత్ క్యాబినెట్ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందని నల్లమల్ల సాక్షిగా మాట ఇచ్చారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా ఓ ఉమ్మడి కుటుంబాన్ని, అద్భుతమైన సమాజాన్ని నిర్మించబోతున్నామని తెలిపారు.

తెలంగాణ గడ్డపై దశాబ్దాలుగా ఉన్న దున్నేవాడిదే భూమి నినాదాన్ని ఇందిరా సౌర గిరి జిల్లా వికాసం వంటి పథకాల ద్వారా చట్టాలుగా అమలు చేస్తున్నామని అన్నారు. తెలంగాణ గడ్డపై ఉన్న నినాదాలు చట్టాలుగా మారాలంటే మరో 20 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండాలన్నారు. నల్లమల డిక్లరేషన్‌ను తూచా తప్పక పాటించి నాలుగు సంవత్సరాల్లో ఈ రాష్ట్ర గిరిజనులకు ఫలితాలు అందిస్తామని మరోసారి హామీ ఇచ్చారు. ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం ప్రారంభం భారతదేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజు.. దేశంలోనే గర్వించదగిన గొప్ప కార్యక్రమమని కొనియాడారు.

## రూ.12,600 కోట్లతో
# నల్లమల డిక్లరేషన్..



నాగర్ కర్నూల్ : తెలంగాణలోని గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపే సరికొత్త పథకానికి ముఖ్యమంత్రి రేవంత్ శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని 2,30,735 మంది గిరిజన రైతులకు 6.69 లక్షల ఎకరాలకు భూ యాజమాన్యపు హక్కులు కల్పించే "ఇందిర సౌర గిరి జల వికాసం" పథకానికి సంబంధించి "నల్లమల డిక్లరేషన్" ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన ముఖ్యమంత్రి గారు మంత్రివర్గ సహచరులతో కలిసి గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి వారిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఉప ముఖ్యమంత్రి భట్టీ , మంత్రులతో కలిసి నల్లమల డిక్లరేషన్‌ను విడుదల చేశారు.

అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "తెలంగాణను దేశానికే ఆదర్శంగా, నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని పదిహేడు నెలల్లో నిరూపించాం. ఇది సరిపోదు. ఇంకా ఎంతో ముందుకు వెళ్లాలి. అందుకు ప్రజలందరూ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి. డిక్లరేషన్‌లో ప్రకటించిన అంశాలను అమలు చేసి చూపిస్తాం.

ప్రతి రైతుకు సోలార్ పంపుసెట్టు ఇవ్వడం ద్వారా విద్యుత్ అవసరం లేకుండా స్వయంగా ఆదాయాన్ని పెంచుకోవడానికి అచ్చంపేటలో చేసిన తరహాలో తెలంగాణ రాష్ట్రంలో చేయడానికి ప్రణాళికలు రూపొందించాలి.

నల్లమల ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి అధికారులు ప్రత్యేకమైన ప్రణాళికలు రచించాలి. ప్రభుత్వం అవసరమైన నిధులు విడుదల చేస్తుంది. ఈ ప్రాంతానికి సాగునీరు, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. పోడు భూములకు హక్కులు కల్పించి పంట భూములుగా మార్చి గిరిజనులను ఆత్మగౌరవంతో బతికే అవకాశం కల్పించాం. అచ్చంపేట నియోజకవర్గాన్ని, ఈ రాష్ట్రానికి దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దే బాధ్యతను స్థానిక రైతులు, గిరిజనులు ఇక్కడికి విచ్చేసిన వేలాది మంది రైతులు బాధ్యతగా తీసుకోండి. ప్రపంచానికే అచ్చంపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం. ఈ నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, కళాశాల వంటి పనులకు అధికారులు ప్రణాళికలు రూపొందించిన తర్వాత వాటిపై అవసరమైన నిర్ణయాలు తీసుకుంటా. ఈ ప్రభుత్వం రైతులకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోంది. రుణమాఫీ, బోనస్, రైతు భరోసా, ఉచిత విద్యుత్, 200 యూనిట్ల లోపు గృహ వినియోగంలో ఉచిత విద్యుత్ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టడమే కాకుండా సన్న బియ్యం అందిస్తున్నాం..." అని ముఖ్యమంత్రి గారు అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రిమండలి సభ్యులు, పలువురు లోక్‌సభ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# ఉగ్రకుట్ర కోసం ఇద్దరికి డైరెక్షన్ ..

- ఉగ్రవాద సంస్థ హ్యాండ్లర్ పన్నాగం
- సోషల్ మీడియా ద్వారా పరిచయం
- ఇన్‌స్టా ద్వారా సంప్రదింపులు
- ఈ కేసులో నిందితులకు 14 రోజుల రిమాండ్

హైదరాబాద్ : పేలుళ్ల కుట్ర భగ్నం వ్యవహారంలో ఇద్దరు నిందితుల అరెస్టు కాగా కోర్టులో హాజరుపరిస్తే న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి.

విజయనగరానికి చెందిన సిరాజ్ , సికింద్రాబాద్ చెందిన సమీర్‌లను అరెస్ట్ చేయడం తెలిసిందే..

సిరాజ్ ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉద్యోగ వేటలో ఉంటూ ఉగ్రవాదం వైపు ఆకర్షితుడైనట్టుగా పోలీసులు చెబుతున్నారు.. అల్ హింద్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (అహిం) పేరిట సంస్థ ఏర్పాటు చేసి ఆ సంస్థకు సిరాజ్ నంబర్ వన్‌గా, సమీర్ నంబర్2 వ్యవహరించారు.. ఉగ్రవాద సంస్థ హ్యాండ్లర్.. ఉగ్రకుట్రల కోసం ఇద్దరికీ డైరెక్షన్ చేసినట్లుగా విచారణలో గుర్తించారు సోషల్ మీడియా ద్వారా ఇద్దరితో కాంటెక్ట్ అయ్యారు హ్యాండ్లర్.. ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా ఇద్దరితో సంప్రదింపులు జరిపారట.. పేలుళ్లకు పథకరచన చేసి ఉగ్ర కార్యకలాపాల విస్తరణకు పన్నాగం వేశారు.. పొటాషియం క్లోరేట్, సల్ఫర్ తదితర పేలుడు రసాయనాలను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసి.. ఆ పేలుడు పదార్థాల తయారీపైనా ఆన్‌లైన్‌లోనే అవగాహన పెంచుకున్నారు ఉగ్రవాదులు.



ఈ నెల 21 లేదా 22 తేదీల్లో విజయనగరం పరిసరాల్లో డమ్మీ బ్లాస్ట్‌కు స్కెచ్ వేశారు.. విజయనగర సమీపంలో డమ్మీ బ్లాస్ట్ కు ప్లాన్ చేశారు.. దీనిని పసిగట్టిన తెలుగు రాష్ట్రాల పోలీసులు.. పేలుళ్ల కుట్రను భగ్నంచేశారు.. నిందితులు మరికొందరు యువకులు, మైనర్లతోనూ తరచూ సమావేశాలు నిర్వహించినట్టుగా పోలీసులు చెబుతున్నారు.. గ్రూప్-2 సన్నద్ధత పేరిట హైదరాబాద్‌కు వచ్చిన సిరాజ్.. గ్రూప్-2 పరీక్ష రాసేందుకు విజయనగరం వెళ్లాడట.. సమాచారం అందడంతో నిఘా ఉంచిన తెలంగాణ ఇంటెలిజెన్స్ వర్గాలు.. ఏపీ పోలీసులను అప్రమత్తం చేశాయి.. దీంతో, సిరాజ్ ఇంటిపై దాడి చేసిన విజయనగరంలో పోలీసులు.. పేలుడు రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు.. అనంతరం ఇంటెలిజెన్స్ అధికారులు సికింద్రాబాద్‌లో సమీర్‌ను అరెస్ట్ చేశారు.. సమీర్ ను ట్రాన్సిట్ వారంట్‌పై విజయనగరం తరలించారు.. సిరాజ్ తండ్రి, సోదరులు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్నారు.. కుటుంబం మొత్తం పోలీసు డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తుంటే సమీర్ మాత్రం ఉగ్రవాదం వైపు మళ్లడంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.. ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా.. 14 రోజుల రిమాండ్ విధించింది కోర్టు..

# అందాల పోటీలే కాదు..
# అగ్ని ప్రమాదాలపైనా దృష్టి పెట్టాలి

**మరో ప్రాణం పోకుండా చూడాలి**

**మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి**

**అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్ లేకపోవడం దురదృష్టకరం**

**ఫైరింజన్లు వచ్చాయి కాని నీళ్లు లేవు : : కేటీఆర్**

హైదరాబాద్: అందాల పోటీల మీదే కాదు.. అగ్ని ప్రమాదాల మీద కూడా దృష్టి పెట్టాలని బీఆర్ ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. అగ్ని ప్రమాదాల్లో మరో ప్రాణం పోకుండా ప్రభుత్వం చూడాలన్నారు. చార్మినార్ పరిధి గుల్జార్‌హౌజ్ సమీపంలో అగ్నిప్రమాదం జరిగిన భవనాన్ని ఆయన పరిశీలించారు. తాను రాజకీయంగా మాట్లాడటానికి ఇక్కడికి రాలేదని చెప్పారు. ప్రభుత్వాలు ప్రజల ప్రాణాలు కాపాడాలని పేర్కొన్నారు.



"రూ.5 లక్షల పరిహారం ఇవ్వడం కాదు.. ప్రాణాలపై దృష్టి పెట్టాలి. మృతుల కుటుంబసభ్యులకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. ముఖ్యమంత్రే హోంమంత్రి కాబట్టి ఘటనా స్థలానికి వస్తే అధికారులు ఇంకా బాగా పనిచేస్తారు. వేసవి కాలం వచ్చే ముందు అగ్నిమాపక సిబ్బందితో ప్రభుత్వం సమీక్ష సమావేశాలు నిర్వహించాలి. అగ్నిమాపక యంత్రాలు వచ్చాయి.. కానీ నీళ్లు లేవు. సిబ్బందికి సరైన మాస్కులు లేవని తెలిసింది. అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్ లేకపోవడం దురదృష్టకరం. హైదరాబాద్‌లో ఇదే అత్యంత భారీ అగ్ని ప్రమాదం. నిన్నటిరోజు దుర్భరమైన రోజు.. బాధితులు, మృతుల కుటుంబ సభ్యుల ఆవేదన వర్ణనాతీతం" అని కేటీఆర్ తెలిపారు.

# అందాల పోటీలకు 300 కోట్లు
# ఆధ్యాత్మికతకు రూ.35 కోట్లు ఏంటీ?

**మా ప్రభుత్వం ఉంటే కుంభమేళను తలపించేది**

**యూపీలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించాం**

**పుష్కర స్నానం చేయడం చాలా సంతోషం**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**

కాళేశ్వరం : తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. పుష్కరాలను కుంభమేళ తరహాలో కోట్లాది మందిని తరలించి ఘనంగా నిర్వహించే వాళ్ళమని కేంద్ర మంత్రి బండి సంజయ్ చెప్పారు. అందాల పోటీలకు రూ. 300 కోట్లు విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్యాత్మికతకు రూ. 35 కోట్లు వెచ్చించడం ఏంటి? అని ప్రశ్నించారు. 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే పుష్కారాల స్నానం చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద పుష్కర పండగకు విడుదల చేసిన 35 కోట్ల రూపాయలు ఏర్పాట్లకు సరిపోవన్నారు. యూపీ రాష్ట్రంలో కుంభమేళా కు 50 కోట్ల మందికి బీజేపీ ప్రభుత్వం సరిపడా నిధులు విడుదల చేసి ఘనంగా నిర్వహించిందని గుర్తు చేశారు.

పుష్కరాలను ఈ ప్రాంతానికి పరిమితి చేయడం పద్ధతి కాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. వచ్చే పుష్కరాలకు ఎక్కువ బడ్జెట్ విడుదల చేసి ఘనంగా నిర్వహించాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగడంతో కాళేశ్వరానికి చెడ్డపేరు వచ్చిందని.. పుష్కరాలతోనైన మంచి పేరు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ముక్తీశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వం కోట్లు వెచ్చించిన నిధులు విడుదల చేయలేదని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన రూ. 200 కోట్ల హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

